పోస్టర్ ఆవిష్కరిస్తున్న దాస్యం వినయ్ భాస్కర్

పేదల పక్షాన బీఆర్ఎస్ లీగల్ సెల్ పోరాటం

జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, జనవరి 2 : పేదల పక్షాన బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ పోరాడుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బాలసముద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం బీఆర్ఎస్ లీగల్ సెల్ నూతన సంవత్సర పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాదిగా పార్టీ, కార్యకర్తలను అక్రమ కేసుల నుంచి కాపాడడంలో లీగల్ సెల్ ఎంతో కృషి చేసిందన్నారు. పార్టీ శ్రేణులకు బీఆర్ఎస్ లీగల్ సెల్ ఎప్పుడు అందుబాటులో ఉంటుందని తెలిపారు. సమర్థవంతమైన అడ్వకేట్లు లీగల్ సెల్‌ను ముందుండి నడపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లీగల్ సెల్ అధ్యక్షుడు వినోద్ కుమార్, కమిటీ సభ్యులు శివరాజ్, జనార్దన్ గౌడ్, శ్రీరామ్ కిరణ్, రవి, వేణు పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పులి రజినీకాంత్, వెంకన్న, నయీముద్దీన్, వెంకటేశ్వర్లు, ఉడుతల సారంగపాణి, కుసుమ లక్ష్మీనారాయణ, జానకీరాములు, రమేశ్, సుంచు కృష్ణ పాల్గొన్నారు.

కాజీపేట ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై శివకృష్ణ

విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడొద్దు

కాజీపేట, జనవరి 2 : విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ తదితర మత్తు పదార్థాల బారిన పడొద్దని కాజీపేట ఎస్సై శివకృష్ణ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తున్నదని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ట్రాఫిక్ నిబంధలు పాటించాలని, తల్లిదండ్రులను గౌరవించి, క్రమశిక్షణతో నడుచుకోవాలని తెలిపారు. ఎవరైనా బాలికలతో అసభ్యకంగా ప్రవర్తిస్తే డయల్ 100 లేదా షీ టీంకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి విక్రయాల గురించి 8712584473కు సమాచారం ఇవ్వాలన్నారు. పోలీస్ కళాజాగృతి బృందం పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాబృందం ఇన్‌చార్జి ఏఎస్సై నాగమణి, సభ్యులు విలియం, వెంకటేశ్వర్లు, రత్తయ్య, పూల్‌సింగ్, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి పాల్గొన్నారు.

82 లీటర్ల గుడుంబా పట్టివేత

ఆత్మకూరు/శాయంపేట, జనవరి 2 : బ్రాహ్మణపల్లి – ఆత్మకూరు గ్రామాల మధ్య గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా తరలిస్తున్న 62లీటర్ల గుడుంబాతో పాటు ఒకరిని అరెస్ట్ చేసి ఎక్సెల్ బండిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. నల్లబెల్లి మండలం రేలకుంట గ్రామానికి చెందిన మొద్దు పైడి గుడుంబాను వరంగల్ నగరానికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పైడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఎస్సై తిరుపతి పాల్గొన్నారు. అలాగే 20 లీటర్ల గుడుంబా పట్టుకొన్నట్లు శాయంపేట ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపారు. పోలీసులు రాజు, రత్నాకర్ పెట్రోలింగ్ చేస్తుండగా జోగంపల్లి చలివాగు ప్రాజెక్టు వద్ద ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి వారి చేతిలో ఉన్న సంచులు పడేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని పట్టుకుని సంచులను చూడగా అందులో 20 లీటర్ల గుడుంబా ఉన్నట్లు గుర్తించారు. నిందితులు మండలంలోని సూర్యనాయక్ తండాకు చెందిన నగావత్ రాహుల్, బానోత్ నరేశ్‌గా గుర్తించినట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

నేడు సామాజిక తనిఖీ ప్రజా వేదిక

ఆత్మకూరు, జనవరి 2 : ఉపాధి హామీ పథకం 16వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక సభ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రజావేదిక నిర్వహిస్తున్నామని, ప్రత్యేకాధికారులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరుకావాలన్నారు.

సమ్మెబాటలో సివిల్ సప్లయ్ హమాలీలు

- బకాయిలు చెల్లించాలని డిమాండ్
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్

నిరవధిక సమ్మె చేస్తున్న హమాలీలకు సంఘీభావం తెలిపి మాట్లాడుతున్న మునీశ్వర్

హనుమకొండ, జనవరి 2 : సివిల్ సప్లయ్ హమాలీలు సమ్మెబాట పట్టారు. అక్టోబర్ 4వ తేదీన హమాలీ రేట్లు, వివిధ సమస్యలపై కమిషనర్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్న జీవో విడుదల చేసి బకాయిలు చెల్లించాలని, అప్పటివరకు సమ్మె కొనసాగుతుందని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయీస్ హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునీశ్వర్ స్పష్టం చేశారు. గురువారం హనుమకొండ అంబేద్కర్ భవనం పక్కన సివిల్ సప్లయ్ హమాలీ కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి హమాలీ రేట్లు పెంచి ఇతర సమస్యలను పరిష్కరిస్తామని చెప్పి 12 నెలల తర్వాత కూడా పెంచిన రేట్లకు జీవో విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో తప్పని పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నారని పేర్కొన్నారు. అక్టోబర్‌లో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేసేందుకు జీవో విడుదల చేయాలని, అదేవిధంగా దసరా పండుగకు ఇచ్చే యూనిఫామ్, స్వీట్లు, బోనస్, బట్టల కుట్టుకూలీ బకాయిలు వెంటనే చెల్లించాలని పలుమార్లు కమిషనర్, అధికారులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జీవో విడుదల చేయాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి వేల్పుల సారంగపాణి, జక్కు రాజుగౌడ్ మాట్లాడుతూ.. సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో హమాలీ కూటు అధ్యక్షుడు కుక్కల మల్లయ్య, కొనుపుల భిక్షపతి, కన్నెబోయిన కుమార్, బోయిని సమ్మయ్య, బోయిని కట్టయ్య, ఆకుల సుధాకర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 124 మందికి జరిమానా

సుబేదారి, జనవరి 2 : హనుమకొండ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 124 మంది వాహనదారులకు రూ.1,70,800 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మరో 11మందికి రూ.5,700 జరిమానా విధించినట్లు చెప్పారు.

డీఎంహెచ్‌వో కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న డీఎంహెచ్‌వో అప్పయ్య, ఉద్యోగులు

ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

వరంగల్, జనవరి 2 : వైద్య, ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో అప్పయ్య అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉద్యోగులు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరి బాధ్యతలను వారు సమర్థవంతంగా నిర్వహిస్తూ నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌వో మదన్ మోహన్ రావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి మహేందర్, పీవోడీటీటీ లలితాదేవి, ప్రోగ్రాం అధికారులు హిమబిందు, ఇఫ్తాధర్, అహ్మద్, నాగరాజు, ఏవో కోలా రాజేశ్‌కుమార్ గౌడ్, డెమో అశోక్‌రెడ్డి, ఎస్‌వో ప్రసన్నకుమార్, సూపరింటెండెంట్ వేణు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, డీటీసీ శ్రీనివాస్

రోడ్డు భద్రతా మాసోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

హసన్‌పర్తి, జనవరి 2 : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంప్ కార్యాలయంలో, కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య, పోలీస్ కమిషన్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా, ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ గురువారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు డీసీపీ రవి, ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ, ఏసీపీ సీసీ ఆర్‌బీ డేవిడ్‌రాజ్, వెహికల్ ఇన్‌స్పెక్టర్లు రమేశ్ రాథోడ్, కిశోర్‌బాబు, వేణుగోపాల్, ఉదయ్, ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, సీతారెడ్డి పాల్గొన్నారు.

మడికొండలోని డంపింగ్ యార్డులో బయో మైనింగ్ పనులను పరిశీలిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

రెండు నెలల్లో బయో మైనింగ్ పూర్తి చేయాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జనవరి 2 : డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తను రెండు నెలల్లో బయో మైనింగ్ ద్వారా శుద్ధి చేసి స్థలాన్ని అప్పగించాలని బయో మైనింగ్ కాంట్రాక్ట్ పొందిన ఏజెన్సీ ప్రతినిధులను బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. గురువారం ఆమె మడికొండలోని డంపింగ్ యార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టెండర్ పొందిన ప్రకారం వంద శాతం చెత్తను బయో మైనింగ్ ద్వారా శుద్ధి చేసే పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రేటర్‌లోని పలు అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బాలసముద్రం, పోతన నగర్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్వహణ తీరును పరిశీలించిన ఆమె చెత్త సేకరణ క్రమపద్ధతిలో చేయాలని సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ట్రాన్స్‌ఫర్ స్టేషన్ల నిర్వహణను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నయీంనగర్ బ్రిడ్జి రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, ఈఈ మహేందర్, సంతోష్ బాబు, స్మార్ట్‌సిటీ పీఎంవో భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ, జనవరి 2 : హనుమకొండ టౌన్ పరిధిలోని పలు ప్రాంతాలలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆపరేషన్స్ డీఈ సాంబారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అభివృద్ధి పనుల నేపథ్యంలో కేయూసీ సబ్‌స్టేషన్ ఈద్గా 11కేవీ ఫీడర్ పరిధిలోని పోచమ్మకుంట, శ్రీనగర్ కాలనీ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, యాదవనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని హనుమాన్‌నగర్ డబ్బాల ఏరియాలో ఉదయం 10 నుంచి 11.30గంటల వరకు, న్యూశాయంపేట సబ్‌స్టేషన్ నేచర్‌క్యూర్ 11కేవీ ఫీడర్ పరిధిలోని టెంపుల్ ట్రీ విల్లాస్ ఏరియాలో ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నామని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

కలెక్టర్‌కు బెడ్‌షీట్లు అందజేత

హనుమకొండ, జనవరి 2 : జడ్పీ సీఈవో విద్యాలత ఆధ్వర్యంలో ఎంపీడీవోల కేంద్ర కమిటీ అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు కలెక్టర్ ప్రావీణ్యను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ సూచనల మేరకు సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు ఉపయోగపడేలా రూ. 5వేల విలువైన బెడ్ షీట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జూలూరు ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు మొగుళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామడుగు లక్ష్మీప్రసన్న, కార్యవర్గ సభ్యులు కమటం అనిల్ కుమార్, గుండె బాబు, ఎంపీడీవోలు సురేందర్, ఫణిచంద్ర, పులి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గంజాయి స్వాధీనం.. ముగ్గురిపై కేసు నమోదు

శాయంపేట, జనవరి 2 : పొడి రూపంలో తరలిస్తున్న గంజాయి పట్టుకొని ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన గురువారం జరిగింది. ఎస్సై జక్కుల పరమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గోవిందాపూర్ స్టేజీ వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అయితే ఇక్కడి శ్రీశైలం హోటల్ వద్ద ముగ్గురు వ్యక్తులు బైక్‌పై ట్రిపుల్ రైడింగ్‌తో వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేశారు. వీరి వద్ద పొడి రూపంలో ఉన్న 30 గ్రాముల గంజాయి దొరికినట్లు తెలిపారు. ఎనుమాముల మార్కెట్ పరిధిలోని ముసలమ్మకుంటకు చెందిన దారంగుల దేవేందర్, బాలాజీనగర్‌కు చెందిన కొండపల్లి రాకేశ్, ముసలమ్మ కుంటకు చెందిన దారంగుల సతీశ్ గంజాయి అమ్మేందుకు తరలిస్తున్నట్లు చెప్పారు. ముగ్గురిపై నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు

కేయూలో బీసీ మహాసభ పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, జనవరి 2 : సావిత్రీబాయి పూలే 194వ జయంతి సందర్భంగా కామారెడ్డి డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో 3న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించతలపెట్టిన బీసీ మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ కాకతీయ విశ్వవిద్యాలయ లైబ్రరీ ఎదుట బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జెట్టి రాజేందర్, బీసీ రాష్ట్ర నేత కత్తెరపల్లి దామోదర్, బీఆర్ఎస్వీ నాయకులు పాలమాకుల కొమురయ్య, కొనుకటి ప్రశాంత్, పిన్నింటి విజయ్‌కుమార్, శంకర్, రవి, ప్రవీణ్, అఖిల్, నవీన్, రోహిత్, తిరుపతి, సురేశ్, శ్రీరామ్, అనిల్, ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి

నాసా చాలెంజ్‌లో కిట్స్ విద్యార్థులకు అవార్డు

హసన్‌పర్తి, జనవరి 2 : నాసా స్పేస్ యాప్ చాలెంజ్‌లో ఎర్రగట్టుగుట్ట సమీపంలోని కిట్స్ (వరంగల్) విద్యార్థుల బృందం టీమ్ వన్ గ్లోబల్ పీపుల్స్ చాయిస్ –2024 అవార్డు గెలుచుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అశోక్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాసా స్పేస్ యాప్ చాలెంజ్‌కు భారత్ నుంచి ఎంపికైన ఏకైక ఎగ్జిబిట్ కిట్స్ విద్యార్థుల టీమ్‌దేనని అన్నారు. కిట్స్‌కు అంతర్జాతీయ గుర్తింపు రావడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను కిట్స్ చైర్మన్ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, కోశాధికారి నారాయణరెడ్డి, సెక్రటరీ సతీశ్‌బాబు, పీఆర్‌వో ప్రభాకరాచారి అభినందించారు.

పీడియాట్రీషియన్ల భర్తీకి నోటిఫికేషన్

4న ఇంటర్వ్యూలు

వరంగల్, జనవరి 2 : ఎస్ఎన్‌సీయూ పథకంలో భాగంగా హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న రెండు పీడియాట్రీషియన్ల పోస్టుల భర్తీకి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాలతో డీఎంహెచ్‌వో అప్పయ్య నోటిఫికేషన్ విడుదల చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో నియామకం చేసే ఈ పోస్టులకు ఈ నెల 4వ తేదీన డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి 2 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్, ఎండీ పీడియాట్రిక్స్ చదివిన వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. తర్వాత ఎంబీబీఎస్, డీసీహెచ్ వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. వయో పరిమితి, నిబంధనలు, ప్రభుత్వ నియమాలు వర్తిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో హాజరుకావాలని కోరారు.

వింగ్ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న మేయర్ గుండు సుధారాణి

పారిశుధ్య వాహనాల పార్కింగ్‌కు స్థలం గుర్తించాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, జనవరి 2 : పారిశుధ్య వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాన్ని గుర్తించాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం కార్పొరేషన్‌లో వింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిసరాల్లో అనువైన ప్రాంతాన్ని గుర్తించి పారిశుధ్య వాహనాలు పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పార్కింగ్ స్థలంలోనే వాహనాలను శుభ్రం చేయాలన్నారు. తుప్పు పట్టిన వాహనాలను స్క్రాప్ కింద అమ్మకానికి టెండర్ పిలవాలని ఇంజినీర్లను ఆదేశించారు. అలాగే బల్దియా ఆవరణలోని పరిసరాలను మేయర్ తనిఖీ చేశారు. ప్లానిటోరియం, మ్యూజికల్ గార్డెన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇండోర్ స్టేడియం సమీపంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్‌ను రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. అక్కడ నిలిపి ఉన్న మొబైల్ టాయిలెట్ బస్సుల పరిస్థితిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మ్యూజికల్ గార్డెన్‌కు ఎదురుగా ఉన్న బల్దియా స్థలంలో గ్రీనరీ అభివృద్ధి చేయాలని సూచించారు. అక్కడే వినాయక విగ్రహాల తయారీకి షెడ్ నిర్మించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకరలింగం, హెచ్‌వోలు రమేశ్, లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రవీందర్, కృష్ణారెడ్డి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంపై ఎందుకింత చిన్నచూపు?

ఐనవోలు, జనవరి 2 : కాంగ్రెస్ ప్రభుత్వానికి మల్లికార్జునస్వామి ఆలయంపై ఎందుకింత చిన్న చూపు అని బీఆర్ఎస్ గ్రామ బీసీ సెల్ అధ్యక్షుడు గడ్డం రఘువంశీ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు 10 రోజుల్లో ప్రారంభం కానున్నాయని, ఇప్పటివరకు ఆలయ పాలకవర్గం నియమించక పోవడం దారుణమన్నారు. లక్షలాదిగా భక్తులు తరలి వచ్చే ఆలయ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని ఆరోపించారు. ఆలయానికి ఇన్‌చార్జి ఈవో కాకుండా పర్మినెంట్‌గా గ్రేడ్ వన్ ఈవోను నియమించాలని ఆ ప్రకటనలో కోరారు.

బీసీటీయూ వరంగల్ అధ్యక్షుడిగా సాంబమూర్తి

సాంబమూర్తికి నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

కాజీపేట, జనవరి 2 : కాజీపేట పట్టణం ఫాతిమానగర్‌కు చెందిన పెరుమాండ్ల సాంబమూర్తిని బీసీటీయూ వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ నియామక పత్రం గురువారం అందించారు. కాగా, తన ఎన్నికకు సహకరించిన జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీటీయూ నేతలు తాళ్లపల్లి సురేశ్, సుంకరి శ్రీనివాస్‌రావుకు సాంబమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, VELUDANDI SREEDEVI (New Name), R/o H.No. 15-6-194, Papaiahpet, Warangal Mandal, Warangal District - 506002 TG, Have Changed my name from RSS SREEDEVI (OLD NAME), To VELUDANDI SREEDEVI (New Name) for all purposes.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూలో సమ్మేళనం పోస్టర్ల ఆవిష్కరణ

హనుమకొండ చౌరస్తా, జనవరి 2 : కాకతీయ విశ్వవిద్యాలయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం పోస్టర్లను వీసీ ప్రతాప్ రెడ్డి ఆవిష్కరించారు. 4న ఉదయం 10 గంటలకు విశ్వవిద్యాలయ మహిళా ఇంజినీరింగ్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షాలు తెలిపారు. 2017 నుంచి 2024 వరకు బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు ఈ సమ్మేళనంలో పాల్గొనవచ్చని చెప్పారు. వీసీ, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ వేణుగోపాల్ రెడ్డి, కన్వీనర్ వైష్ణవి హాజరవుతారని తెలిపారు.

పింగిళి డిగ్రీ కాలేజీ మొదటి సెమిస్టర్ ఫలితాల విడుదల..

వడ్డేపల్లిలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లో డిగ్రీ ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ సుహాసిని (ఎఫ్ఏసీ) తెలిపారు. పింగళి కాలేజీలో బీఏ, బీకాం, బీఎస్సీ, ప్రథమ సెమిస్టర్ ఫలితాలను గురువారం కేయూ వీసీ ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ మల్లారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కట్ల రాజేందర్ విడుదల చేశారు. అడిషనల్ కంట్రోలర్స్ కొలిపాక శ్రీనివాస్, రాజిరెడ్డి, అకాడమిక్ కో ఆర్డినేటర్ అరుణ, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సురేశ్‌బాబు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

హనుమకొండ, జనవరి 2 : స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తే గ్రామీణ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తారన్నారు. పరకాల నియోజకవర్గంలో పాల సేకరణ కేంద్రాలు, మహిళా సంఘాల ద్వారా ఒక మెగావాట్ సోలార్ విద్యుత్ కేంద్రాలు, ప్రతి మండలంలో 350 మందిని గుర్తించి వారికి టైలరింగ్ తర్ఫీదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. వీటికి ఉయ్ హబ్ (ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్) సహకారం అందిస్తుందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల ద్వారా చేసిన ఉత్పత్తులకు దేశీయ, విదేశీ మార్కెట్లలో విక్రయించేలా చర్యలు చేపడితే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. వారు తయారు చేసిన ఉత్పత్తులను మరింత మెరుగుదిద్దే విధంగా డీఆర్‌డీఏ, మెప్మా, పరిశ్రమల శాఖ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. మార్కెట్ డిమాండ్ మేరకు వస్తువులు తయారు చేసేలా స్వయం సహాయక సంఘాల సభ్యులకు నైపుణ్యాలతో కూడిన శిక్షణ ఇవ్వాలని, తద్వారా వారు ఆర్థికంగా ఎదగడానికి దోహదపడాలన్నారు. ఉయ్ హబ్ సీఈవో సీత మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే హబ్ ముఖ్య ఉద్దేశమన్నారు. మహిళలు ఇప్పుడు చేస్తున్న వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడడం, కొత్త రంగాల్లో గుర్తించి వాటికి సంబంధించి తర్ఫీదు ఇచ్చి ప్రోత్సహిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో వైవీ గణేశ్, పరకాల ఆర్డీవో నారాయణ, హనుమకొండ, వరంగల్ డీఆర్డీవోలు మేన శ్రీను, కౌసల్యాదేవి పాల్గొన్నారు.

సాంకేతికతతో అభివృద్ధిలో మరింత ముందుకు..

- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి

సీఎండీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఇన్‌చార్జి డైరెక్టర్లు, ఉద్యోగులు

హనుమకొండ, జనవరి 2 : సాంకేతికతను అందిపుచ్చుకొని అభివృద్ధిలో మరింత ముందుకు వెళ్తున్నామని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ భవన్‌లో సీఎండీని పలువురు ఉద్యోగులు కలిశారు. అభివృద్ధిలో టెక్నాలజీ భాగంగా మారిందని చెప్పారు. ఇప్పటికే సాంకేతికంగా సంస్థలో అనేక మార్పులు తీసుకువచ్చామని చెప్పారు. వినియోగదారులకు మరింత చేరువయ్యే దిశగా అడుగులు వేశామని, అందులో భాగంగా విద్యుత్ ప్రజా వాణి, అధికారుల పొలం బాట, కస్టమర్ రిసెప్షన్ డెస్క్ తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రతి ట్రాన్స్‌ఫార్మపై 1912 టోల్ ఫ్రీ నంబర్ ముద్రించామని, విద్యుత్ సమస్యల పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు సంస్థ ఉద్యోగులు కంకణబద్ధులై పనిచేయాలని కోరారు. నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవాలని, విద్యుత్ ప్రమాదాలను నివారించాలన్నారు. సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, సదర్‌లాల్, తిరుపతిరెడ్డి, మధుసూదన్, సీవీవో జనార్దన్, సీఈలు, సీజీఎంలు అశోక్, బికంసింగ్, కేఎన్ గుట్ట ఉన్నారు.

రెండు రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్, జనవరి 2 : ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్ ఖిలా వరంగల్ పెట్రోల్ పంప్ వద్ద లీకేజీ మరమ్మతులు కొనసాగుతున్న నేపథ్యంలో అండర్ రైల్వేగేట్ జోన్‌లో శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. పైప్‌లైన్ మరమ్మతుల్లో భాగంగా నాగమయ్య దేవాలయ ప్రాంతం, నాగేంద్రనగర్, శివనగర్, చింతల్, ఖిలావరంగల్ తూర్పు, మధ్య కోటలు, మైసయ్యనగర్, కాశీకుంట ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.